# కాంగ్రెస్‌కు ఓటు వేస్తే చీకట్లే

- సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి
- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- కనగల్ మండలంలో ఎన్నికల ప్రచారం



కనగల్ మండలం చర్లగౌరారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ సిటీ, నవంబర్ 22 : కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలు నమ్మి ఓటేస్తే చీకట్లు తప్పవని బీఆర్ఎస్ నల్లగొండ అభ్యర్థి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం చర్లగౌరారం, మంచినీళ్లబాయి, దర్వేశిపురం, పర్వతగిరి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా ప్రచారంలో ఎమ్మెల్యే వెంట తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని అన్నారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుత మ్యానిఫెస్టో ప్రకారం సౌభాగ్య లక్ష్మి పథకంతో మహిళలకు రూ.3 వేల భృతి, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేల వరకు ప్రభుత్వం పెంచనుందన్నారు. తనను ఓడించేందుకు కాంగ్రెస్ నాయకులు డబ్బు సంచులతో దిగారన్నారు. నల్లగొండను దత్తత తీసుకున్న కేసీఆర్ రాష్ట్రంలోనే జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచుతానని హామీ ఇచ్చారన్నారు. నల్లగొండలో మెడికల్ కళాశాల ఐటీ హబ్, బత్తాయి మార్కెట్‌ను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. సాగుకు 3గంటల కరెంట్ సరిపోతుందని చెప్పిన కాంగ్రెస్‌ను బొందపెట్టాలన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సభతోనే కాంగ్రెస్ పని అయిపోయిందని జనాలు లేక సభ ప్రాంగణం బోసిపోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాషా, జడ్పీటీసీ వెంకటేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ అలుగుబెల్లి నర్సింహరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి,ఎంపీటీసీ నకిరేకంటి సైదులు, దర్వేశిపురం,చర్ల గౌరారం, పర్వతగిరి సర్పంచులు అలుగుబెల్లి పూలమ్మ, చింతల యాదగిరి, చెన్నగోని అంజమ్మారామచంద్రు,ఉపసర్పంచ్ జినుకుంట్ల అంజయ్య, ఆలయ మాజీ చైర్మన్ యాదగిరి నాయకులు శ్రీశైలం ఉన్నారు.



చర్లగౌరారంలో సభకు హాజరైన జనం

## వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : మండలంలోని కుదావన్ పూర్, కొత్తపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుదావన్‌పూర్‌లో పార్టీలో చేరిన వారిలో యెన్నా జాన్‌రెడ్డి, గుత్తా శంకర్‌రెడ్డి, యెన్నా వెంకట్‌రెడ్డి, కొత్త శంకర్, వేణుతో పాటు వివిధ పార్టీలకు చెందిన సమారు 20 మంది ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దూదిపాల జాన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజుపేట మల్లేశ్ ,యెన్నా అశోక్‌రెడ్డి, యెన్నా నర్సిరెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొత్త వెంకన్న పాల్గొన్నారు. కొత్తపల్లిలో పార్టీలో చేరిన వారిలో ఊట్కూర్ ఆంజనేయులు, మాధవి, బుట్టి శ్రీను,యాదగిరి, లింగ స్వామి, శేఖర్, బండారు యాదయ్య, బండారు రాజు, పాలడుగు ఎల్లమ్మ, నర్సిరెడ్డి, సత్యవతి, మట్టోజు బ్రహ్మాచారి, సుదర్శన్‌తో పాటు 100 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాలడుగు రమేశ్, శ్రీకాంత్ ,ఇరిగి శ్రీశైలం పాల్గొన్నారు .

## జాతీయ స్థాయిలో ఎంజీయూ ఖ్యాతి చాటాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, నవంబర్ 22: ఎంజీయూ ఐటీసీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో సత్తా చాటి ఎంజీయూ ఖ్యాతి చాటాలని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్.గోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐటీసీ క్రీడాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఖోఖో పురుషుల, మహిళాల పోటీల్లో విజేతలను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాలతో స్నేహభావం ఏర్పడడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి జి. ఉపేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి పాల్గొన్నారు.

## రెండో సారి ఎమ్మెల్యే కంచర్ల గెలుపు ఖాయం

- తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్



తిప్పర్తి: ప్రచారం చేస్తున్న మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్

తిప్పర్తి, నవంబర్ 22: నల్లగొండ శాసన సభ్యులుగా కంచర్ల భూపాల్‌రెడ్డి రెండో సారి విజయం సాధించడం ఖాయమని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కందుల లక్ష్మయ్య అన్నారు. తిప్పర్తి ఎస్సీ కాలనీలో బుధవారం వారు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సమన్యాయం కల్పిస్తున్నారన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సస్యశామలం అవుతుందన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు సుమారు 50మంది మంగళవారం రాత్రి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు వారికి ఆయన గలాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో నాయకులు కొమ్ముగిరి, రఘు, బాలరాజ్, నవీన్, శ్రీకాంత్, జాకటి ఆనంద్, సురేందర్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, పక్కన కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- అన్ని బృందాలు సమన్వయంతో పని చేయాలి
- సీఈసీ స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా

నల్లగొండ, నవంబర్ 22: శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడగానికి ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే వివిధ శాఖలు, టీమ్‌లు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం పోలీసు అబ్జర్వర్లు విజయ్ సింగ్ మీనా, వినీత్ ఖన్నా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అర్వీ కర్ణన్, ఎస్పీ అపూర్వ రావుతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ రోజు శాంతి భద్రతలు భంగం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ ముందు 72 గంటలు అతి ముఖ్యమైన సమయమని, పోలీస్, ఇతర శాఖలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, కేంద్ర సాయుధ బలగాల ను పూర్తి స్థాయిలో ఎన్నికలు విధులు కేటాయించాలన్నారు. ఎన్నికలల్లో అదనపు బలగాలను రిజర్వులో ఉంచుకోవాలని, అత్యవసర సమయంలో వినియోగించుకోనేలా పోలీస్ సిబ్బంది ఉండాలే చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అర్వి కర్ణన్ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే ఇప్పటి వరకు సీజ్ నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువు ల వివరాలు, కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లపై, ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్, పోలింగ్ సిబ్బంది వివరాలను, ఎన్నికల నిబంధనలను పాటించేలా ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్, వీడియో వీవింగ్ టీములు నిర్వహిస్తున్న పనులను వివరించారు. అనంతరం ఎస్పీ అపూర్వ రావు ఎన్నికల ఏర్పాట్లలో తీసుకున్న బందోబస్తు చర్యలను, చెక్ పోస్టుల పనితీరును, సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను వివరించారు. ఎన్నికల కోడ్ అమలు నుంచి ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను ఈ నెల 30న ఎన్నికలకు సంబంధించి పోలీస్ శాఖ పరంగా తీసుకున్న చర్యలను వివరించారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్ • కేంద్ర ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్‌తో వీడియో కాన్ఫరెన్స్

నల్లగొండ, నవంబర్ 22: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. ఢిల్లీ నుంచి కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ కుమార్ వ్యాస్ బుధవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వ్యాస్ సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఈనెల 30న జరగనున్న పోలింగ్ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమీక్షలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు

## ఎన్నికల సామగ్రిని చెక్ చేసుకోవాలి : కలెక్టర్ ఆర్వీ కర్ణన్

నల్లగొండ : పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ముందు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని అధికారులు చెక్ చేసుకోవాలని కలెక్టర్ ఆర్.వీ. కర్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో బుధవారం సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది వచ్చారా లేదా అని సెక్టార్ అధికారులు హాజరు తీసుకోవాలన్నారు. సంబంధిత సిబ్బందిచే కంట్రోల్ యూనిట్, పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కి సంబంధించినదా కాదా అని నిర్ధారించుకోవాలన్నారు.

### వెబ్ కాస్టింగ్‌కు 141 మంది

ఎన్నికలను వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ చేయడానికి 141 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఆయన బుధవారం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్ కాస్టింగ్‌ను మానిటరింగ్ చేయడానికి నిర్వహించిన టీములకు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. వెబ్ కాస్టింగ్ లో భాగంగా షాడో, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఈ మానిటరింగ్ టీం పర్యవేక్షిస్తుందన్నారు. అలాగే ఐదు గంటల తర్వాత జరిగే పోలింగ్ ను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని వెబ్ కాస్టింగ్ పర్యవేక్షకులను ఆదేశించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు పాటిల్ హేమంత్ కేశవ్ , చెన్నయ్య, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్ కుమార్, ఎన్ఐసి అధికారి గణపతి రావు పాల్గొన్నారు.

### 2,053 మంది హోం ఓటింగ్ వినియోగం

నవంబర్ 20,21తేదీల్లో జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో 2,375 మంది ఓటర్లకు 2,053మంది హోం ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్‌లో ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఫారం 12–డి ద్వారా దరఖాస్తు చేసుకుని రిటర్నింగ్ అధికారి ఆమోదించిన అర్హులైన వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించగా నియోజకవర్గాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి పారదర్శకంగా హోం ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. హోం ఓటింగ్ మిస్ అయిన వారికి ఈ నెల 26,27తేదీల్లో మరోసారి నిర్వహించనున్నట్లు తెలిపారు.